క్లుప్తంగా

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

లింగగూడెం(పెనుగంచిప్రోలు): గ్రామంలో తాగునీటి సరఫరాను సోమవారం పునరుద్ధరించారు. గ్రామానికి తాగునీటిని అందించే పథకానికి సంబంధించిన పైపులైన్ పెనుగంచిప్రోలు మునేరు వరదకు కొట్టుకుపోయింది. దీంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేసి తాగునీటిని అందిస్తున్నామని సర్పంచ్ బరిగెల మంగమ్మ తెలిపారు.

బీఎల్ఓలతో మున్సిపల్ కమిషనర్ సమీక్ష

నందిగామ: పట్టణ పరిధిలో జరుగుతున్న ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమానికి సంబంధించి సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం బీఎల్ఓలతో ఇంటింటి ఓటరు వెరిఫికేషన్‌కు సంబంధించి చర్చించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పంటలను పరిశీలించిన ఏవో

వీరులపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో నీటి ఎద్దడికి గురై ఎండిపోతున్న మొక్కజొన్న పంటలను సోమవారం మండల వ్యవసాయాధికారి జోగేంద్రప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరాకు 200 లీటర్ల నీటికి రెండు కిలోల పొటాషియం నైట్రేట్‌ను మొక్క మొదలు నుంచి మొక్క మొ త్తం తడిచేలా పిచికారీ చేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఆరవ వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్



నందిగామ: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందజేయాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సూచించారు. పట్టణంలోని ఆరవ వార్డులో సోమవారం ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా డ్రెయిన్లలో పూడిక తీతలు, పిచ్చి మొక్కల తొలగింపు, బ్లీచింగ్ చల్లించడం, ఫాగింగ్ తదితర కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు కూడా సహకరిస్తే పట్టణాన్ని స్వచ్ఛ నందిగామగా ఆదర్శంగా తీర్చిదిద్దవచ్చునన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ షేక్ యాకూబ్, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎండకు ఎండి...వానకు తడిసి...



పెనుగంచిప్రోలు: అక్రమ రవాణాకు పాల్పడి పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన వాహనాలు, వివిధ కేసులకు సంబంధించి పట్టుకున్న వాహనాలు ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పు పట్టిపోతున్నాయి. తెలంగాణ నుంచి అక్రమంగా రవాణా మద్యం రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలతో పాటు నిబంధనలు పాటించకుండా ప్రయాణం చేస్తున్న వాహనాలను తనిఖీల్లో పట్టుకున్న పోలీసులు వాటిని పోలీస్‌స్టేషన్ పక్కన స్థలంతో పాటు, పక్కన ప్రైవేటు స్థలంలో నిలిపారు. అయితే ఎంతో విలువైన వాహనాలు ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పు పట్టి పోవటంతో పాటు కార్ల చుట్టూ మొక్కలు పెరిగి కనిపించకుండా పోతున్నాయి. అక్రమ రవాణాలో పట్టుబడిన వాహన యజమానులకు నోటీసులు జారీ చేసి, స్పందించని పక్షంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలం వేయాల్సి ఉంటుందని పోలీసు అధికారులు చెబుతున్నారు.

వైఎస్సార్ బీమా సొమ్ము మంజూరు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని 5 వ వార్డుకు చెందిన పసుపులేటి ఉమామహేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్ బీమా కింద మృతునికి రూ.లక్ష మంజూరయ్యాయి. ఈ సందర్భంగా మంజూరు పత్రాన్ని సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ ప్రసాద్, గృహ సారథి నిరంజన్, వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ చేతుల మీదుగా సోమవారం మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

అన్నవరం(జగ్గయ్యపేట): సీజనల్ వ్యాధులపై వైద్యారోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కలిగించాలని బూచవరం వైద్యాధికారి స్రవంతి అన్నారు. గ్రామంలో జరుగుతున్న ఫీవర్ సర్వేను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండేలా ఆరోగ్య సిబ్బంది అవగాహన కలిగించాలన్నారు. 104 సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు వెంకట్రావ్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

త్వరలోనే పట్టణ సుందరీకరణ పనులు

గాంధీ సెంటర్‌ను పరిశీలించిన ఎమ్మెల్సీ అరుణకుమార్



గాంధీ సెంటరును పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామటౌన్: నందిగామ పట్టణ సుందరీకరణ పనులను త్వరలోనే చేపడతామని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ తెలిపారు. పట్టణంలో విగ్రహాలు ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గానికి ప్రధాన సెంటరుగా ఉన్న గాంధీ సెంటరును పూర్తి స్థాయిలో ఆధునీకరించి సుందరీకరణ చేస్తామన్నారు. గాంధీ సెంటరు పేరు చిరస్థాయిగా నిలిచేలా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న నట్ అండ్ బోల్ట్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నందిగామ పట్టణ అభివృద్ధికి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తున్నామని భవిష్యత్తులో కూడా ప్రజా సాకర్యాలే లక్ష్యంగా పని చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, పారుపల్లి హరిబాబు, పరిటాల రాము, గద్దె రమేష్ పాల్గొన్నారు.

సీఎం సహకారంతో పట్టణాభివృద్ధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నందిగామ పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నామని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. పట్టణంలోని ఆరవ వార్డులో నూతనంగా చేపడుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.12.50 లక్షలతో సిమంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. గ్రామాలు, వార్డుల్లోని సమస్యలు పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఆ నిధులతోనే ప్రాధాన్యతాక్రమంలో ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జయరాం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, నాయకులు యాకుబ్ అలీ, షేక్ కరిముల్లా, నల్లమల్లి మురళి, మారం అమరయ్య, షేక్ ఫాతిమా, కత్రి రవీంద్ర, మారం అమరయ్య, తానూరి రాము పాల్గొన్నారు.

స్వయం సంఘాలకు స్వయం ఉపాధికే ఆహా క్యాంటిన్లు

- ఆహా క్యాంటిన్ ప్రారంభించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



ఆహా క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: స్వయం సహాయక సంఘాల మహిళలకు స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సహకారం అందించి ఆహా క్యాంటిన్‌లను ఏర్పాటు చేస్తున్నారని శాసన సభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్ రైతు బజార్, ఫ్రూట్ మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన ఆహా క్యాంటిన్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆహా క్యాంటిన్‌ల ద్వారా రూ.40కే నాణ్యమైన, రుచికరమైన భోజనం అందిస్తారని చెప్పారు. ముఖ్యంగా ఆస్పత్రులు, కూరగాయల మార్కెట్‌లకు వచ్చే వారికి, చిరు వ్యాపారులు, కూలీలు, పేదల ఆకలి తీర్చేందుకు మెప్మా ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆహా క్యాంటిన్‌లు ఎంతో దోహదపడతాయని చెప్పారు. ఆహా క్యాంటిన్ యూనిట్‌ల ఏర్పాటుకు ముందుకు వచ్చే సంఘ సభ్యులకు రూ.15 వేల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తుందని తెలిపారు. అనంతరం ఆహా క్యాంటిన్‌లోని ఆహారాన్ని రుచి చూసి పొదుపు సంఘాల మహిళలతో మాట్లాడి క్యాంటిన్ నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జయరాం, పలువురు నాయకులు, మెప్మా సభ్యులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నందిగామ: న్యాయవాదిపై కట్టిన తప్పుడు కేసులను వెంటనే తొలగించాలని నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు డిమాండ్ చేశారు. విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు తగరం కిరణ్ బాబుపై వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు ప్రకాష్, భాస్కరరావు, వెంకట్రావు, నారాయణరావు, సాంబశివరావు, శివరామకృష్ణ బాబు, విద్యాసాగర్, దాదా హుస్సేన్, సుబ్రహ్మణ్యం, రాజు, కాంతారావు పాల్గొన్నారు.

అశ్రునయనాల నడుమ విజయశేఖర్ అంత్యక్రియలు

- అనారోగ్యంతో ఏఎంసీ ఛైర్మన్ మృతి
- నివాళులర్పించిన విప్ ఉదయభాను, నాయకులు



ముత్తినేని విజయశేఖర్ (ఫైల్)



ముత్తినేని అంతిమ యాత్రలో పాల్గొన్న విప్ ఉదయభాను

చిల్లకల్లు(జగ్గయ్యపేట): జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్, సీనియర్ నాయకుడు ముత్తినేని విజయశేఖర్ (65) అనారోగ్యంతో ఆదివారం అర్ధరాత్రి విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. గ్రామంలోని ఆయన స్వగృహంలో సోమవారం మృతదేహాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ గ్రామ సర్పంచ్‌గా, సీనియర్ రాజకీయ నాయకునిగా విజయశేఖర్ ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆయన మృతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. నివాళులర్పించిన వారిలో కేడీసీసీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, నాయకులు గాంధీ, వేల్పుల రవికుమార్, నాగిరెడ్డి, గాదెల రామారావు, చిలుకూరి శ్రీనివాసరావు, శ్రీనివాస్ గౌడ్‌తో పాటు నియోజకవర్గంలోని పలువురు నాయకులు నివాళులర్పించారు.

పాడె మోసిన విప్ ఉదయభాను

విజయశేఖర్ అంతిమ యాత్రలో ఉదయభాను పాల్గొని పాడె మోశారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో అంతిమ యాత్ర నిర్వహించారు. ఈ అంతిమ యాత్రలో శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

అక్టోబర్ 2 నుంచి ఆడుదాం ఆంధ్ర క్రీడలు

జగ్గయ్యపేటఅర్బన్: అక్టోబర్ 2 నుంచి 9 వ తేదీ వరకు ఆడుదాం ఆంధ్ర పేరుతో నియోజకవర్గ స్థాయి, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పలు రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు సోమవారం తెలిపారు. స్థానిక జీవీజే జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు జరుగుతాయని తెలిపారు. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలకు నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో నిలిచిన విజేతలకు రూ.35 వేలు, రూ.15 వేలు, రూ.5 వేల చొప్పున, జిల్లా స్థాయిలో విజేతలకు రూ.60 వేలు, రూ.30 వేలు, రూ.10 వేల చొప్పున, రాష్ట్ర స్థాయిలో విజేతలకు రూ.5 లక్షలు, రూ.3 లక్షలు, రూ.2 లక్షల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. బ్యాడ్మింటన్ క్రీడకు నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, జిల్లా స్థాయిలో రూ.35 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రాష్ట్ర స్థాయిలో విజేతలకు రూ.2 లక్షలు, రూ.లక్ష, రూ.50 వేల చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొని ఆడదలుచుకున్న వారు వారి సచివాలయం పరిధిలోని సచివాలయంలో పేర్లు నమోదుచేసుకోవాలని కోరారు.

ఉదయభానుకు ముస్లిం మైనార్టీ నేతల అభినందన



ఉదయభానుకు అభినందనలు తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ సభ్యునిగా నియమితులైన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు పలువురు అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సోమవారం వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు, ఈద్గా ప్రెసిడెంట్ షేక్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ నాయకులు ఉదయభానును ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ప్రతినిధులు కూడా పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కొనసాగుతున్న సామాజిక తనిఖీ గ్రామసభ

బండిపాలెం(జగ్గయ్యపేట): గ్రామ సచివాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్పీలు గ్రామంలో 2022–23కు సంబంధించి జరిగిన ఉపాధి హామీ పనుల వివరాలను ప్రజలను, కూలీలను అడిగి తెలుసుకున్నారు. మండల స్థాయిలో వచ్చే నెలలో జరిగే సభలో నిర్భయంగా ప్రజలు సమస్యలు చెప్పుకోవచ్చని ఏపీవో సంతోష్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు



నిర్మాణంలో ఆర్బీకే భవనం



నిర్మాణం పూర్తి చేసుకున్న నవాబుపేట-జయంతిపురం రహదారి

నవాబుపేట(పెనుగంచిప్రోలు): మండలంలోని నవాబుపేట గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.40 లక్షలతో సచివాలయ భవనం నిర్మాణం పూర్తి చేసుకుంటోంది. రూ.21 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మాణంలో ఉంది. నవాబుపేట నుంచి జయంతిపురం వరకు సుమారుగా రూ.6 కోట్లతో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద రహదారి నిర్మాణం రూ.69 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణం జరిగాయి. నాడు–నేడు కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, మూడు లేఅవుట్లలో 300 ఇళ్ల నిర్మాణం వేగంగా జరుగుతోంది. గ్రామం నుంచి ముప్పాళ్ల వరకు తారు రోడ్డు నిర్మాణం జరిగింది.



తుదిదశకు చేరుకున్న సచివాలయ భవన నిర్మాణం

ఎమ్మెల్యే సహకారంతో



స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సహకారంతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టాం. గ్రామంలో ఇల్లు లేని పేదవాడు ఉండకూడదనే ఉద్దేశంతో సుమారుగా జగనన్న కాలనీల్లో 300 మందికి స్థలాలు కేటాయించాం. వాటిలో సకల సౌకర్యాలు కల్పిస్తున్నాం. సచివాలయం, ఆర్బీకేలు త్వరలో ప్రారంభం కానున్నాయి.

–గొర్రెముచ్చు మేరీ, సర్పంచ్

గిడుగు రామ్మూర్తి జయంత్యుత్సవాలు



కంచికచర్ల జెడ్పీ స్కూల్‌లో క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కంచికచర్ల: గిడుగు రామ్మూర్తి జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి మాట్లాడుతూ పోటీలో విజేతలకు మంగళవారం బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ ఇస్మాయేలు, శివజ్యోతి, పి.కుమారి, ఏవీడీ కుమారి, వెంకట్రావు, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాలకు మేలు

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



జుజ్జూరులో గడపగడపలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జుజ్జూరు(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మంచి చేస్తూ సుపరిపాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో సోమవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తేదీ క్యాలెండర్‌ను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, సర్పంచ్ రమావత్ కోటి, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, నాయకులు జయాలుద్దీన్, రమావత్ రాము, షేక్ ఫయాజ్, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో మార్పులకు డాక్యుమెంట్లు సమర్పించాలి

తహసీల్దార్ పబ్బూరి శంకరబాబు



కంచికచర్లలో బీఎల్ఓలతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శంకరబాబు

కంచికచర్ల: గ్రామాల్లో ఓటరు వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయిందని సరైన డాక్యుమెంట్‌లు ఉంటేనే ఓటరు లిస్టులో చేర్పులు మార్పులు జరుగుతాయని తహసీల్దార్ పబ్బూరి శంకరబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం బూత్‌లెవల్ అధికారులు, వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. కొత్తగా ఓటు హక్కు కావాలని వెయ్యి దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. 637 మంది ఓటరు లిస్టు నుంచి ఓటును తొలగించాలని దరఖాస్తులు వచ్చాయని, మార్పులు, చేర్పుల కోసం 1,318 మంది నుంచి అర్జీలు వచ్చాయని తెలిపారు. వీటన్నిటిని సంబంధిత వీఆర్వో నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని కార్యాలయానికి సమర్పిస్తారని తెలిపారు. వాటిని క్షుణంగా పరిశీలించి తిరిగి జిల్లాకు ఆమోదానికి పంపించాలన్నారు. ఈ పనులన్నీ వేగవంతం చేసి మూడు రోజుల్లో పూర్తి చేయాలని బీఎల్ఓలను ఆదేశించారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఓటర్‌లిస్టులో పేర్లు తొలగించాలన్నా, చేర్చాలన్నా, మార్పులు చేర్పులు చేయాలన్నా ఒరిజనల్ పత్రాలు సమర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ షేక్ నాగుల్‌మీరా, బీఎల్ఓలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే స్పందన

13 అర్జీలు స్వీకరించిన ఆర్డీఓ రవీంద్రరావు



స్పందన అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో రవీంద్రరావు

నందిగామ: సమస్యలు తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ ఎ.రవీంద్రరావు సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా డివిజన్ పరిధిలోని పలు మండలాల నుంచి మొత్తం 13 అర్జీలు అందాయని, వాటిలో ఎనిమిది రెవెన్యూ సమస్యలకు సంబంధించినవి 11 కాగా వ్యవసాయ శాఖకు సంబంధించి 1, హౌసింగ్‌కు సంబంధించి ఒకటి చొప్పున అందినట్లు ఆర్డీవో తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ స్పందన కార్యక్రమం ద్వారా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే వెంటనే వాటిని పరిష్కరిస్తామన్నారు.వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖలకు బదిలీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి అర్జీకు సంబంధించి సమస్య పరిష్కారమయ్యేంతవరకు మానిటరింగ్ జరుగుతుందన్నారు. నిజమైన బాధితులకు న్యాయం చేసేందుకే ప్రభుత్వం స్పందన కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో రాజకిషోర్, పలువురు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ముక్త్యాల రాజా వర్ధంతి



ముక్త్యాల రాజా విగ్రహానికి నివాళులర్పిస్తున్న చలసాని ఆంజనేయులు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): వాసిరెడ్డి రామగోపాలకృష్ణ మహేశ్వర ప్రసాద్ (ముక్త్యాల రాజా) 51వ వర్ధంతిని గ్రామంలోని పాలశీతలీకరణ కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల శీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేయటంలో విజయవాడ పాల ఫ్యాక్టరీ ఏర్పాటులో ముక్త్యాల రాజా కీలక భూమిక పోషించారని చెప్పారు. పశ్చిమ కృష్ణా రైతులకు విశేష సేవలందించారని తెలిపారు. కార్యక్రమంలో చంద్రమౌళి, మేనేజర్ విజయ సంపత్ కుమార్, కేసీపీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను తక్షణమే గుర్తించాలి

డీవైఈవో వెంకటప్పయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈవో వెంకటప్పయ్య

నందిగామ: తప్పనిసరిగా బడి ఈడు పిల్లలు ప్రతి ఒక్కరూ చదువుకునేలా చూడాలని డీవైఈవో ఎం.వెంకటప్పయ్య సిబ్బందికి సూచించారు. నియోజకవర్గంలోని పలు స్థాయిల సిబ్బందితో సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా నాలుగు మండలాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించి పలు అంశాలపై ఆయా మండలాల ఎంఈఓ లతో చర్చించారు. అనంతరం డీవైఈవో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని ఈ తరుణంలో బడి ఈడు పిల్లలు ప్రతిఒక్కరూ కూడా పాఠశాలకు వచ్చి చదువుకునేలా చూడాలన్నారు. ప్రతి గ్రామంలోనూ బడి బయట ఉన్న పిల్లలను తక్షణమే గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంఈవోలు, సచివాలయాల ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.